రైల్వే అండర్ పాస్‌ల నిర్మాణం అభినందనీయం

- తొలగిన ప్రయాణికుల ఇక్కట్లు
- ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు
- దెందులూరు, కురెళ్లగూడెం వద్ద అండర్ పాస్‌ల ప్రారంభోత్సవం



దెందులూరు: అలుగులగూడెం వద్ద అండర్‌పాస్‌ను ప్రారంభిస్తున్న కొఠారు రామచంద్రరావు,నాయకులు, అధికారులు



భీమడోలు: కురెళ్లగూడెం- అంబర్‌పేట రైల్వే అండర్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న రైల్వే అధికారులు, వివిధ పార్టీల నాయకులు

దెందులూరు: రైల్వే అండర్ పాస్‌ల నిర్మాణంతో ప్రయాణికుల ఇక్కట్లు తొలగనున్నాయని ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, స్థానిక బీజేపీ నాయకులు దెందులూరు– అలుగులగూడెం రైల్వేగేటు వద్ద అండర్‌పాస్ నిర్మాణం కోసం చేసిన కృషి అభినందనీయమని ఆయన అన్నారు. సోమవారం దెందులూరు– అలుగులగూడెం రైల్వే గేటు వద్ద నూతనంగా నిర్మించిన అండర్ పాస్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవం చేయగా రైల్వే గేటు వద్ద కొఠారు రామచంద్రరావు, నాయకులతో కలిసి అండర్‌పాస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సమావేశంలో కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా వేలాది మంది ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా ఉన్న రైల్వేగేటు సమస్య పరిష్కారమై అండర్ పాస్ నిర్మాణం పూర్తవడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రారంభోత్సవానికి కారకులైన ప్రతి ఒక్కరినీ రామచంద్రరావు అభినందించారు. వర్షాకాలంలో అండర్‌పాస్‌లో నీళ్లు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దెందులూరు– శ్రీరామవరం రైల్వేగేటు వద్ద నూతన బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి రావడంతో పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని అన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు మాట్లాడుతూ వేలాది మంది ప్రజలకు అండర్‌పాస్ నిర్మాణం వరమన్నారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. రైల్వే జెడ్‌ఆర్‌సీసీ మెంబర్ గుమ్మడి చైతన్య, మండల బీజేపీ అధ్యక్షుడు బుజ్జి గోపాల్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోదీ సోమవారం 1,500 అండర్‌పాసులను ఒకేసారి ప్రారంభించారని అన్నారు. రైల్వే ఉద్యోగుల సంఘ నేత వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మొటపర్తి రాంబాబు మాట్లాడుతూ అండర్‌పాస్ మంజూరు, నిర్మాణం, ప్రారంభోత్సవం వరకు విశిష్ట సేవలందించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. దెందులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, సర్పంచ్ తోట ఏసమ్మ, జెడ్‌ఆర్‌సీసీ మెంబర్ గుమ్మడి చైతన్య, బుజ్జిగోపాల్, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, పోకల రాంబాబు, గణేశన్ బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు.

రైల్వే వ్యవస్థ అభివృద్ధికి పీఎం మోదీ పెద్ద పీట

భీమడోలు: రైల్వే వ్యవస్థ అభివృద్ధికి పీఎం నరేంద్ర మోదీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని విజయవాడ రైల్వే ఏడీఈ జేవీబీ చంద్రరావు అన్నారు. దేశ వ్యాప్తంగా నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాసులు సోమవారం దేశ ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. దీనిలో భాగంగా కురెళ్లగూడెం నుంచి అంబర్‌పేట మీదుగా ఎం.నాగులపల్లికి వెళ్లే రహదారిలోని రైల్వే గేటు వద్ద రూ.6.91కోట్లతో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిని పీఎం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, బీజేపీ నాయకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో ఏడీఈ జేవీబీ చంద్రరావు మాట్లాడుతూ రైళ్ల రాకపోకలు సురక్షితంగా, సునాయాసంగా సాగేందుకు ఈ బ్రిడ్జిలు, అండర్‌పాసులు దోహదపడతాయన్నారు. ఈ బ్రిడ్జిలు వల్ల అన్ని రంగాల ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తొలగిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో కురెళ్లగూడెం సర్పంచ్ గుడివాడ నాగగౌతమి సీతారామాంజనేయులు, ఎంపీటీసీ విజయభాను, ఉంగుటూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శరణాల మాలతీరాణి, వైసీపీ నేత ఏపూరి రాంబాబు, కోకన్వీనర్ వెజ్జు ధర్మారావు, మహిళామోర్చా అధ్యక్షురాలు ఏ.శోభారాణి, మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ పటేల్, నాయకులు పులి వీరరాఘవులు, వర్ధినీడి కపిరాజు, గంధం భాస్కరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దెందులూరులో రోడ్డు నిర్మాణం



దెందులూరు కో ఆపరేటివ్ బ్యాంకు రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న నాయకులు

దెందులూరు: దశాబ్దాలుగా దెందులూరు గ్రామంలోని కోఆపరేటివ్ బ్యాంకు రోడ్డు నిర్మాణం లేక గ్రామ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రోడ్డు అభివృద్ధికి రూ.70 లక్షల నిధులు మంజూరు చేశారు. సుమారు కిలో మీటరు పొడవున రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు పోకల రాంబాబు, కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొలుసు గణపతి రావు, పార్టీ నాయకులు తొత్తడి కృష్ణ నిర్మాణ పనులను పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గణపవరంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

గణపవరం: గణపవరంలోని పలు పోలింగ్ కేంద్రాలను సోమవారం పోలీస్, రెవెన్యూ అధికారులతో పాటు ఎన్నికల సెక్టోరియల్ అధికారులు పరిశీలించారు. గణపవరంలోని బాలుర హైస్కూలు, చినరామచంద్రపురం, జగన్నాథపురం, ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోని 8 పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించారు. బూత్‌లలో సదుపాయాలు, ఓటర్లు వేచి ఉండటానికి, ఓటింగ్ వేయడానికి కావలసిన ఏర్పాట్లు, శాంతి భద్రతలు, పోలింగ్ బాక్సుల రక్షణ వంటి విషయాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో గణపవరం సీఐ ఎంవీ సుభాష్, ఎస్సై వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్, బీఎల్వోలు పాల్గొన్నారు.

అభాగ్యులను ఆదుకోవడమే మానవత లక్ష్యం

భీమడోలు: అభాగ్యులను ఆదుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల ప్రతినిధులు అన్నారు. సూరప్పగూడెం, పోలసానిపల్లి గ్రామాల్లో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారి కుటుంబాలకు సోమవారం మానవత మండల శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులను అందించారు. తొలుత బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు చిలపర్తి రామారాయుడు, మండల చైర్మన్ గుల్ల నూకరాజు, మండల కన్వీనర్ పి.సత్యనారాయణ, ప్రతినిధులు వెజ్జు కొండలరావు, గంధం వెంకట్రావు, అల్లాడ ప్రసాదరావు, గుల్ల అప్పారావు, చిలపర్తి ఆదినారాయణ పాల్గొన్నారు.

నేడు మాదేపల్లిలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని ఏపీఎం ప్రభావతి తెలిపారు. మండలంలోని డ్వాక్రా మహిళలు 5,990 మందికి నాలుగో విడత రూ.4.94 కోట్ల ఆసరా చెక్కులు అందించనున్నట్టు పేర్కొన్నారు.

అలరించిన విరాటపర్వం హరికథ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో ఏలూరు నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 92వ శ్రీ రామకోటి మహోత్సవాల్లో భాగంగా సోమవారం విశేష పూజలు చేశారు. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులచే మౌన ధ్యానం, భక్తి గీతాలాపన, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. నాలుగు రోజులుగా దుర్గా సప్తశతి బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లలితా సహస్ర నామ కోటి కుంకుమార్చన ముగింపు సందర్భంగా ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి, చండీ హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం నగరానికి చెందిన మైలవరపు లక్ష్మీ నరసింహం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన ముదపాక బాల సుందరం భాగవతార్ విరాటపర్వం అనే అంశంపై నిర్వహించిన హరికథా కాలక్షేపం భక్తులను విశేషంగా అలరించింది.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



గణపవరంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎయిడ్స్ నియంత్రణ మండలి సభ్యులు

గణపవరం: హెచ్ఐవీ, ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని దీనిపై అవగాహన ఉంటే ప్రాణాలు దక్కించుకోవచ్చని ఎయిడ్స్ నియంత్రణ మండలి కళాజాతా సభ్యులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం గణపవరంలో ఎయిడ్స్ వ్యాధి, నివారణ, చికిత్స తదితర అంశాలపై కళా ప్రదర్శనతో ప్రజలకు వివరించారు. ఐసీటీసీ కేంద్రం ఆవశ్యకత, ఏఆర్‌టీ ప్రాధాన్యత, హెచ్ఐవీ టోల్‌ఫ్రీ నంబరు 1097 అంశాలను వివరించారు. కళాజాతా బృందం నాయకుడు మిరియాల రవిబాబు, సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలోని వివిధ కూడళ్లలో వీధి నాటకాలు ప్రదర్శించారు.

6న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మార్చి 6వ తేదీన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బి.ప్రణవి తెలిపారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ప్రారంభమౌతుందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై చర్చిస్తారని వివరించారు.

బువ్వనపల్లి రోడ్డు పనుల ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు పుప్పాల చినబాబు, కన్నబాబు

నిడమర్రు: రూ.2.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బువ్వనపల్లి– అడవికొలను రహదారి పనులను సోమవారం ఎమ్మెల్యే సోదరులు, గణపవరం, నిడమర్రు మండలాల వైఎస్సార్ సీపీ బాధ్యులు పుప్పాల కన్నబాబు, పుప్పాల చినబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ దశాబ్దకాలంగా అడవికొలను– బువ్వనపల్లి ఆర్అండ్‌బీ రహదారి అధ్వానంగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. గ్రామాల్లోని రహదారుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. యుద్ధప్రాతిపదికపై పనులు పూర్తి చేసేలా ఎమ్మెల్యే వాసుబాబు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ కోడే కాశి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ సంకు సత్య కుమార్, స్టేట్ యూత్ జాయింట్ సెక్రటరీ సంకు నాగేశుబాబు, సచివాలయాల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు, వైస్ ఎంపీపీ సమయం వీరరాఘవులు, సర్పంచ్‌లు కిలారి సత్యవతి రవిబాబు, పుప్పాల మెహర్‌కుమార్, ఎంపీటీసీ మజ్జి శ్రీను, నీటి సంఘం అధ్యక్షుడు నిమ్మల బుజ్జి, పార్టీ అధ్యక్షుడు పాపోలు సుబ్బారావు, గంధం సుభాష్, కాన్వెంట్ శ్రీను, నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులున్నారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే భవిష్యత్తుకు భద్రత



గణపవరంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు

గణపవరం: ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని, దానివల్ల భవిష్యత్తుకు భద్రత ఏర్పరుచుకునే అవకాశం ఉంటుందని జిల్లా లీడ్ మేనేజర్ నాగేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం గణపవరంలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సంస్థ జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. సామాజిక భద్రతా పథకాలైన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి పథకం, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన తదితర పథకాలు, వాటి ప్రయోజనాలను వివరించారు. గణపవరం బ్యాంక్ ఆఫ్ ఇండియా బీఎం చైతన్యకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని, బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని, బ్యాంకు యాప్‌లు, క్యూఆర్ కోడ్‌పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. నగదు రహిత సేవలు, బ్యాంకింగ్ పథకాలు, బ్యాంకు రుణాలు, డిపాజిట్లు, బీమా పథకాలను ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో ప్రజలకు వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల సమన్వయకర్త అనిల్, కౌన్సిలర్లు రాజశేఖర్, లక్ష్మణకుమారి, ప్రశాంతరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



పెదపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న పెదపాడు ఎస్సై శుభశేఖర్

పెదపాడు: విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల ద్వారా వచ్చిన మెసేజ్‌లపై తగిన జాగ్రత్తలు వహించాలని పెదపాడు ఎస్సై కే శుభశేఖర్ తెలిపారు. మండలంలోని పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో విద్యార్థులకు దిశ యాప్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సోషల్ మీడియా వల్ల కలుగే నష్టాలు, తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ నేడు ఆధునిక సాంకేతి పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందని, ప్రతి ఒక్కరి చేతిలో ఆండ్రాయిడ్ ఫోను ఉంటోందని దానికి అలవాటు పడిన విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. సోషల్ మీడియా మాధ్యమాల వల్ల ఉపయోగం ఎంత ఉంటుందో నష్టం అంతకంటే ఎక్కువ ఉంటోందని ఆయన అన్నారు. అపరిచిత వ్యక్తుల ద్వారా వచ్చే సందేశాలను ఓపెన్ చేయడం ద్వారా సైబర్ నేరగాళ్లు మన వ్యక్తిగత సమాచారాన్ని తస్కరిస్తారని వివరించారు. ఆపదలో ఉన్న బాధితులకు దిశ యాప్ అండగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను తమ ఫోన్లలో నిక్షిప్తం చేసుకోవాలని అన్నారు. ప్రత్యేకంగా 112 టోల్ ఫ్రీ నంబరు, 100 నంబరును డయల్ చేస్తే వెంటనే 10 నిమిషాల్లో బాధితుల చెంతకు చేరుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకుల నర్సింహారావు సేవలు స్ఫూర్తిదాయకం



దెందులూరులో ఆకుల నర్సింహారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

దెందులూరు: ఆధ్యాత్మిక, విద్య, వైద్య రంగాల్లో దాతలు విరివిగా సేవలందించాలని వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు అన్నారు. సోమవారం దెందులూరు ఇంద్రవనంలో ఆకుల నర్సింహారావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాంబాబు మాట్లాడుతూ విద్యాదాత ఆకుల నర్సింహారావు సేవలను ఆయన కుటుంబం కొనసాగించాలని కోరారు. దెందులూరు, కొవ్వలి పలు పాఠశాలల హెచ్‌ఎంలు రామశర్మ, శ్రీదేవి, పోలీస్, విద్యా, వైద్య శాఖల ఉద్యోగులు మాట్లాడుతూ ఏలూరు, దెందులూరు మండలాల్లో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, ఫర్నీచర్, విద్యార్థులకు యూనిఫాం, ఫీజులు చెల్లించడం, దేవాలయాలకు ఆర్థిక సాయం అందించిన ఆకుల నర్సింహారావు సమాజానికి స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. నర్సింహారావు సేవలను కొనసాగిస్తామని ఆయన కుటుంబ సభ్యులు సభలో ప్రకటించారు.

పోలియో చుక్క జీవితానికి రక్ష



పల్స్‌పోలియోపై సమీక్షిస్తున్న అధికారులు

గణపవరం: పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని, పోలియో చుక్క జీవితాంతం రక్షణ ఇస్తుందని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. సోమవారం గణపవరం తహసీల్దార్ కార్యాలయంలో పల్స్‌పోలియో టాస్క్ ఫోర్స్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మండలంలోని ఐదేళ్ల లోపు వయస్సున్న పిల్లలను వారి తల్లిదండ్రులు గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలు, మొబైల్ పోలియో కేంద్రాలకు తీసుకెళ్లి పోలియో చుక్కలు వేయించాలని వివరించారు. వచ్చేనెల 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 4,500 మంది ఐదేళ్లలోపు పిల్లలు ఉన్నారని, అందరికీ పోలియో చుక్కలు వేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. సమీక్షలో తహసీల్దార్, ఎంపీడీవో, ఐసీడీఎస్ సీడీపీవో తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈవీఎంలపై శిక్షణ

ఉంగుటూరు: ఈవీఎంల పనితీరుపై శిక్షణ కార్యక్రమం మంగళవారం ఉదయం 11 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు కట్టా వెంకటశివయ్య తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించే సమావేశంలో సెక్టర్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు హాజరవుతారని తెలిపారు. ఏలూరు ఆర్డీవో ఖాజావల్లీ పాల్గొంటారని చెప్పారు. ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. పోలింగ్ సమయాల్లో ఈవీఎంలు మొరాయిస్తే వాటిని సరిచేసి ఎలా పనిచేయించాలి తదితర అంశాలపై శిక్షణనిస్తారని తహసీల్దార్ తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో గోపన్నపాలెం క్రీడాకారుల ప్రతిభ



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ సాధించిన జిల్లా జట్టు

దెందులూరు: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ మహిళా విభాగం పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహిళా జట్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడంతో పాటు స్వర్ణం సాధించిందని గోపన్నపాలెం వ్యాయామ విద్యా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేలు అన్నారు. సోమవారం గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు నంద్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహిళా జట్టు చాంపియన్ షిప్ సాధించడం ఒక్క ఎత్తు అయితే జట్టులో పది మంది క్రీడాకారులు గోపన్నపాలెం వ్యాయామ కళాశాల విద్యార్థులు ఉండటం తమ కళాశాలకు గర్వకారణమన్నారు. విజేతలకు సర్టిఫికెట్లను, జ్ఞాపికలను ప్రిన్సిపల్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సూపరింటెండెంట్ పతంజలి, లెక్చరర్లు జయశ్రీ, గణేష్ విద్యార్థులు ఉన్నారు.

ఘంటా ప్రసాదరావుకు అభినందనలు



ప్రసాదరావును అభినందిస్తున్న బీసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ఘంటా ప్రసాదరావును ఏలూరు అర్బన్ బీసీ సంఘం అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి, నాయకులు కిలాడి దుర్గారావులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఇటీవల వైఎస్సార్ సీపీ ఏలూరు అసెంబ్లీ పరిశీలకునిగా నియమితులైన ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బీసీలకు అత్యధికంగా ప్రాధాన్యత, రాజకీయ పదవులు, సంక్షేమ పథకాలు కల్పించింది వైఎస్సార్ సీపీ అని, ఈ ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీసీ లంతా మరోసారి వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏలూరు ఎంపీగా కారుమూరి సునీల్ కుమార్, ఎమ్మెల్యేగా ఆళ్ల నానిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు ఘంటసాల వెంకటరమణ, అబ్బిరెడ్డి రంగముత్యాలు, ఈదలాడ ఉమామహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నేడు క్రాంతి కల్యాణ మండపంలో వలంటీర్లకు వందనం

దెందులూరు/పెదపాడు: ఏలూరు క్రాంతి కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు దెందులూరు నియోజకవర్గ స్థాయి వలంటీర్ల వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పీ.శ్రీలత అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా హాజరవుతారని అన్నారు. ఎమ్మెల్యే చేతులమీదుగా వలంటీర్లకు అవార్డుల ప్రదానం చేసి సత్కరించనున్నట్టు తెలిపారు. దీనిపై వలంటీర్లకు, గ్రామ కార్యదర్శులకు సమాచారం అందించామని ఎంపీడీఓ తెలిపారు.

స్పందనకు అధికారుల గైర్హాజరు

దెందులూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి తహసీల్దార్ వీ.జితేంద్ర, ఎంపీడీఓ పీ.శ్రీలత, ఎంఈఓ కే.అన్నమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి ఒక్క అర్జీ కూడా రాలేదని తెలిపారు. ఈ కార్యక్రమానికి మిగిలిన అన్ని ప్రభుత్వ శాఖల మండలాధికారులు గైర్హాజరయ్యారు. కలెక్టర్ జోక్యం చేసుకుని గైర్హాజరైన మండలాధికారులపై చర్యలు తీసుకుని ప్రతి వారం అన్ని శాఖల మండలాధికారులు హాజరయ్యేలా ఆదేశాలివ్వాలని పలువురు కోరుతున్నారు.

గ్యాస్ సిలిండర్ల సీజ్

ఏలూరు (టూటౌన్): వాణిజ్య అవసరాలకు సబ్సిడీ సిలిండర్లను వినియోగిస్తున్న ఏలూరులోని పత్తేబాదకు చెందిన టిఫిన్ సెంటర్‌పై విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేశారు. రూ.16,008 విలువైన ఆరు గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. రీజనల్ విజిలెన్స్ అధికారి కరణం కుమార్ ఆదేశాల మేరకు సోమవారం తనిఖీలు నిర్వహించారు. టిఫిన్ సెంటర్ యజమానిపై కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ తహసీల్దార్ బి.కన్నాకుమారి, ఎస్సై సీహెచ్ రంజిత్ కుమార్, రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు.